## పదకొండు విడుతల్లో రైతుబంధు అందుకున్న రైతులు, డబ్బులు

### మంచిర్యాల జిల్లా..

| సంవత్సరం | వానకాలం | రూ.కోట్లు | యాసంగి | రూ.కోట్లు |
|---|---|---|---|---|
| 2018 | 1,18,890 | 116.15 | 1,13,571 | 116.38 |
| 2019 | 1,19,127 | 140.85 | 94,934 | 93.52 |
| 2020 | 1,29,845 | 161.47 | 1,32,358 | 163.03 |
| 2021 | 1,34,788 | 162.71 | 1,39,194 | 164.61 |
| 2022 | 1,43,510 | 165.80 | 1,56,357 | 172.11 |
| 2023 | 1,61,813 | 172.99 | - | - |
| మొత్తం | | రూ.920.00 | | రూ.709.65 |

### నిర్మల్ జిల్లా..

| సంవత్సరం | వానకాలం | రూ. కోట్లు | యాసంగి | రూ.కోట్లు |
|---|---|---|---|---|
| 2018 | 1,38,704 | 155.39 | 1,36,786 | 157.04 |
| 2019 | 1,43,433 | 188.25 | 1,16,453 | 133.98 |
| 2020 | 1,58,103 | 215.14 | 1,61,438 | 217.37 |
| 2021 | 1,64,755 | 217.24 | 1,69,541 | 219.11 |
| 2022 | 1,74,767 | 220.73 | 1,86,418 | 227.64 |
| 2023 | 1,85,532 | 229.41 | - | - |
| మొత్తం | | 1226.16 | | 954.14 |

### ఆసిఫాబాద్ జిల్లా

| సంవత్సరం | వానకాలం | రూ.కోట్లు | యాసంగి | రూ.కోట్లు |
|---|---|---|---|---|
| 2018 | 95,439 | 133.40 | 93,370 | 135.20 |
| 2019 | 94,591 | 148.80 | 69,349 | 88.80 |
| 2020 | 1,06,636 | 188.00 | 1,08,590 | 189.60 |
| 2021 | 1,08,590 | 189.60 | 1,10,021 | 189.20 |
| 2022 | 1,14,432 | 191.09 | 1,22,103 | 201.68 |
| 2023 | 1,09,642 | 132.87 | - | - |
| మొత్తం | | 983.76 | | 804.48 |

### ఆదిలాబాద్ జిల్లాలో..

| సంవత్సరం | వానకాలం | రూ.కోట్లు | యాసంగి | రూ.కోట్లు |
|---|---|---|---|---|
| 2018 | 1,16,000 | 181.55 | 1,24,000 | 203.00 |
| 2019 | 1,36,491 | 266.89 | 1,37,817 | 267.34 |
| 2020 | 1,36,793 | 263.00 | 1,37,000 | 264.03 |
| 2021 | 1,47,026 | 272.96 | 1,48,818 | 274.26 |
| 2022 | 1,48,818 | 274.26 | 1,53,000 | 275.99 |
| 2023 | 1,35,623 | 207.56 | - | - |
| మొత్తం | | 1,466.22 | | 1,284.62 |



# చరిత్రాత్మకం రైతుబంధు

## 6,23,334 మంది రైతులకు రూ.8,349.03 కోట్లు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పదకొండు విడుతలుగా అందజేత
- దుబారా అన్న కాంగ్రెస్‌కు ఓటు వేయమంటున్న అన్నదాతలు
- రూ.16 వేలు చేసే కేసీఆర్ పార్టీకి ముక్తకంఠంతో మద్దతు

అప్పో సప్పో చేసి సాగు చేస్తే పంట చేతికొచ్చాక అప్పు ఇచ్చిన సేటుకో, వడ్డీ వ్యాపారికో ఆ పంటను అమ్ముకోక తప్పేది కాదు. తీసుకున్న అప్పుకు వడ్డీ కలిపితే 'అల్లికి అల్లి సున్నాకు సున్నా' అన్నట్లు రైతుకు దమ్మిడి కూడా మిగిలేదు కాదు. స్వరాష్ట్రంలో కేసీఆర్ సీఎం అయ్యాక గడిచిన తొమ్మిదేళ్లలో కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో బీడువారిన భూములు సాగులోకి వచ్చాయి. రైతుబంధు తెచ్చి పంట పెట్టుబడి సాయంగా ఎకరాకు రూ.10 వేల ఇస్తున్నడు. రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు కేంద్రాలు పెట్టి కొంటున్నడు. అన్నింటికి మించి వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్నడు. ఒక్క మాటలో చెప్పాలంటే తెలంగాణలో దండుగ అన్న వ్యవసాయాన్ని పండుగ చేసింది సీఎం కేసీఆర్. రైతుల బతుకుల్లో వెలుగులు నింపిన రైతుబంధును కాంగ్రెస్ నాయకులు దుబారా ఖర్చు అనడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి బహిరంగ సభలో సీఎం కేసీఆర్ రైతుబంధు దుబారానా.. రైతుబంధు కావాల్నా.. వద్దా.. అడుగుతుంటే ఉండాలంటూ దిక్కులు పిక్కటిల్లేలా చెప్తున్నారు. రైతుబంధు దుబారా అని, వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలని చెప్తున్న కాంగ్రెస్‌కు ఓటు వేసేది లేదని ఉమ్మడి జిల్లాలోని రైతులందరూ ముక్త కంఠంతో నినదిస్తున్నరు. రైతుబంధు ఆలోచన చేసిందే కేసీఆర్ సర్కారేనని.. ఇప్పుడు రూ.10 వేలు ఇచ్చినా, రానున్న రోజుల్లో రూ.16 వేలు చేసినా అది వాళ్లతోనే సాధ్యమని, అందుకని మరోసారి బీఆర్ఎస్ పార్టీకే ఓటు వేస్తామని చర్చించుకుంటున్నరు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటివరకు 6,23,334 మంది రైతుల ఖాతాల్లో 11 విడుతల్లో రూ.8,349.03 కోట్లు రైతుబంధు డబ్బులు జమయ్యాయి. ఈ నేపథ్యంలో రైతుబంధుపై రైతులతో మాట్లాడి 'నమస్తే తెలంగాణ' అందిస్తున్న ప్రత్యేక కథనం..

**- మంచిర్యాల, నవంబర్ 11(నమస్తే తెలంగాణ ప్రతినిధి)**

### రైతుబంధు డబ్బులతో ట్రాక్టర్ కిస్తీ కడుతున్న



కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 11, నమస్తే తెలంగాణ : నా పేరు రఘోత్తంరెడ్డి, మా ఊరు దహెగాం. నాకు పదెకరాల భూమి ఉంది. సర్కారోళ్లు రైతుబంధు కింద ఎకరానికి రూ. 5 వేల చొప్పున రూ. 50 వేలు ఇస్తున్నరు. ఇట్లా రెండు పంటలకు రూ. లక్ష నా ఖాతాలో వేస్తున్నరు. నేను ట్రాక్టర్ కోసం లోన్ తీసుకున్న. ఆరునెలలకోసారి కిస్తీ కట్టాలి. రైతుబంధు కింద వచ్చిన డబ్బులను గటే కడుతున్న. ఓ రకంగా చెప్పాలంటే సర్కారే నాకు ట్రాక్టర్ కొనిచ్చినట్లు. పొలాలు దున్నితే వచ్చే డబ్బులను ఎవుసం కోసం వాడుకుంటున్న. మరోసారి అధికారంలోకి వస్తే రైతుబంధు డబ్బులను రూ. 16 వేలకు పెంచుతమని సీఎం చెప్పిండు. ఆయన మాటిస్తే చేసి తీరుతడు. ఇది వరకున్న సర్కారోళ్లు రైతుల బాగోగులను పట్టించుకున్న పాపాన పోలేదు. సీఎం కేసీఆర్ లెక్క రైతులకు మేలు చేసినోళ్లను నేను ఇప్పటి దాకా చూడలేదు. బీఆర్ఎస్ గెలిస్తేనే రైతులు రంది లేకుంటా ఎవుసం చేసుకోవచ్చు. వేరే ఎవ్వరినీ నమ్మినా మోసపోవుడే అయితది. అందుకే మేమంతా బీఆర్ఎస్‌తోనే ఉంటం.

### సాగుకు సాయం దొరికింది..



నాకు గ్రామంలో ఎనిమిదెకరాల భూమి ఉంది. గతంలో పంట పెట్టుబడులు లేక చాలా ఇబ్బందులు పడేటోళ్లం. ఏటా వానకాలం వచ్చిందంటే చాలు భయమయ్యేది. పంట పెట్టుబడులు ఎక్కడి నుంచి తేవాలా అని ఆలోచించేవాళ్లం. దళారుల వద్ద ఎక్కువ వడ్డీతో అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు తెస్తుంటిమి. కొందరు రైతులు దుకాణాల్లో ఉద్దెరకు విత్తనాలు, ఎరువులు తీసుకువచ్చి పంట చేతికొచ్చినంక అమ్మి వడ్డీతో పాటు కట్టేటోళ్లు. అప్పులు ఇచ్చిన దళారులు పంటలను తమకే అమ్మాలని కండీషన్ పెట్టి తక్కువ ధర ఇచ్చేటోళ్లు. మన రాష్ట్రం వచ్చిన తర్వాత రైతులకు పంట పెట్టుబడుల ఇబ్బందులు తప్పినయ్. రైతుబంధు పథకం కష్టాలన్నీ దూరం చేసింది. ఎకరాకు రూ. 10 వేలు ప్రభుత్వమే సాగుకు సాయంగా ఇస్తున్నది. ఇప్పటి వరకు 11 సార్లు రైతుబంధు డబ్బులు వచ్చినయ్. నాకు ఏడాదికి రూ.80 వేల సాయం అందుతున్నది. ఈ పైసలకు మాకు అవసరమైన మంచి విత్తనాలను కొనుగోలు చేస్తం. వర్షాలు పడగానే సకాలంలో విత్తనాలు వేస్తం. సరైన సమయంలో ఎరువులు వినియోగించడంతో పంట దిగుబడులు బాగా వస్తున్నయ్. వానకాలం, యాసంగి పంటల సాగుకోసం పెట్టుబడుల ఇబ్బందులు లేకుండా సర్కారు మా బ్యాంకు ఖాతాల్లో సీజన్‌కు ముందుగానే పైసలు జమ చేస్తున్నది. రైతుబంధు పైసలతో మాకు ఎంతో మేలు జరుగుతున్నది.

**- దశరథ్, రైతు, అంకోలి, ఆదిలాబాద్ రూరల్**

### రైతుబంధుతో రంది లేకుండా ఎవుసం



నాపేరు కందుల వెంకటేశ్. మాది కోటపల్లి గ్రామం. నాకు ఏడెకరాల భూమి ఉంది. రైతుబంధు కింద రెండు పంటలకు కలిపి రూ. 70 వేలు వస్తున్నయ్. పంట పెట్టుబడికి రంది లేకుంటైంది. తెలంగాణ రాకముందు ఎవుసం చేసేందుకు మస్తు తిప్పల పడ్డం. కరెంట్ ఉంటే నీళ్లు.. నీళ్లుంటే కరెంట్ ఉండకపోయేటిది. పెట్టుబడికి డబ్బుల్లేక సావుకార్ల సుట్టూ తిరిగేటోళ్లం. వడ్డీలకు తెచ్చి పంటలేసేటోళ్లం. ఎట్లనో అట్ల.. పంట తీస్తే అస్సలు.. మిత్తీ గాళ్లకే పోయేటిది. అరిగోస పడేటోళ్లం. కొంద రైతే ఎవుసం ఇడిసిపెట్టి పట్టణాల పొంటి పనులకు పోయేటోళ్లు. తెలంగాణ వచ్చినంక రైతుల బతుకులు బాగుపడ్డయి. సర్కారు అనేక పథకాలు తీసుకొచ్చింది. రైతులకు తిప్పల్లేకుండా చేసిన్రు. గీ ఎవుసం చేసే నా బిడ్డకి పెండ్లి చేసిన. ఇంకో బిడ్డ.. కొడుకును మంచిగ చదివించుకుంటున్న. బీఆర్ఎస్ సర్కారు మళ్లోసారి గెలిస్తే రైతుబంధు డబ్బులను రూ.10 వేల నుంచి రూ.16 వేలకు పెంచుతమని అంటుంది. సీఎం కేసీఆర్ మాటిస్తే కచ్చితంగా చేస్తడు. గదే కాంగ్రెసోళ్లు న్యాయం చేస్తారన్న గ్యారంటీ లేదు. గందుకే రైతులందరం కలిసి మళ్లా కారు గుర్తునే గెలిపించుకుంటం.

**- కందుల వెంకటేశ్, రైతు, కోటపల్లి**

# ప్రజల మనిషిగా గుర్తింపు పొందా..

## 40 ఏండ్లుగా వారి సేవలోనే ఉన్నా..

- నాలుగోసారి కూడా ఆశీర్వదిస్తారనే నమ్మకం ఉంది
- పదేళ్లలో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశా
- రూ.5 వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు
- మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేశా..
- ప్రతిపక్షాలను నమ్మే పరిస్థితి లేదు..
- 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



నమస్తే ఇంటర్వ్యూ INTERVIEW

**నమస్తే : ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరిగింది?**

**జోగు రామన్న:** ఉమ్మడి రాష్ట్రంలో ఆదిలాబాద్‌కు వెనుకబడిన జిల్లాగా పేరుంది. ఆంధ్రా పాలకులు ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిని విస్మరించడంతో నియోజకవర్గ ప్రజలు కనీస సౌకర్యాలకు నోచుకోక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో ఆదిలాబాద్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నది. రాష్ట్రంలో అభివృద్ధి చెందిన జిల్లాలతో పోటీ పడుతున్నది. నియోజకవర్గంలో పదేండ్లలో రూ. 5 వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేశాం. ప్రభుత్వ పథకాలతో ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారు.

**నమస్తే : నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి?**

**జోగు రామన్న :** ఆదిలాబాద్ నియోజకవర్గం వ్యవసాయం, విద్య, వైద్యం, రవాణా, ఉపాధి, ఇతర రంగాల్లో ఎంతో ప్రగతి సాధించింది. ఉమ్మడి రాష్ట్రంలో రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేది. ఆదిలాబాద్ నుంచి బేల మండలం ఉపసనాలకు పోవాలంటే రెండున్నర గంటల సమయం పట్టేది. వానకాలంలో వాగులు పొంగి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి. పదేండ్లలో నియోజకవర్గంలో రూ. 1000 కోట్లతో రవాణా సౌకర్యాలు మెరుగుపర్చాం. జిల్లా కేంద్రం నుంచి ప్రజలు 45 నిమిషాల్లో తమ గ్రామాలకు చేరుకుంటున్నారు. రాత్రి, పగలు లేకుండా రాకపోకలు సాగిస్తున్నారు. నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ అయిన పెన్‌గంగ ప్రాజెక్టు పేరిట ప్రతిపక్షాలు 40 ఏండ్లు మోసం చేశాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ చనాక, కొరాట ప్రాజెక్టును నిర్మించి ఇక్కడి ప్రజల కలలను సాకారం చేశారు. రూ.1165 కోట్లతో నిర్మించే ఈ ప్రాజెక్టుతో 52 వేల ఎకరాలకు సాగునీరు అందబోతున్నది. ట్రయల్ రన్ పూర్తికాగా ఎన్నికల తర్వాత నీటి విడుదల జరుగుతున్నది.

**నమస్తే : విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో నియోజకవర్గం ప్రగతి సాధించింది.**

**జోగు రామన్న :** గత పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా ఈ రంగాలు నిరాదరణకు గురయ్యాయి. దీంతో పేద విద్యార్థులు చదువుల్లో రాణించలేకపోయారు. ప్రభుత్వం కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తున్నది. రెసిడెన్షియల్ స్కూళ్లలో పేద విద్యార్థులకు కార్పొరేట్ చదువులు అందుతున్నాయి. ఈ స్కూళ్ల అప్‌గ్రేడేషన్ వల్ల డిగ్రీ వరకు చదువుకునే అవకాశం లభిస్తుంది. జిల్లాలో రిమ్స్ మెడికల్ కళాశాలలో యూజీ, పీజీ వైద్యవిద్య అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వం ఆదిలాబాద్‌కు వ్యవసాయ కళాశాల, జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలను మంజూరు చేసింది. ఫలితంగా జిల్లా విద్యార్థులు స్థానికంగా ఉంటూ ఉన్నత చదువులు అభ్యసించే అవకాశం లభించింది. ఆదిలాబాద్‌లో ఐటీ రంగం విస్తరణ జరుగుతున్నది. ప్రభుత్వం రూ. 40 కోట్లతో ఐటీ టవర్‌ను నిర్మిస్తున్నది. ఇప్పటికే రెండు ఐటీ కంపెనీలు తమ కార్యకలాపాలు నిర్వహిస్తుండగా 250 మంది మంచి వేతనాలతో పని చేస్తున్నారు. గతంలో జిల్లాలో వైద్యసేవలు అందక ఏజెన్సీలో మరణాలు సంభవించేవి. ఇప్పుడు గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల వైద్యసేవలు అందుతున్నాయి. రిమ్స్ సూపర్ స్పెషాలిటీ దవాఖానలో ఖరీదైన వైద్యం పేదలకు ఉచితంగా లభిస్తుంది. మహారాష్ట్ర ప్రజలు మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్‌కు వస్తున్నారు. మిషన్ భగీరథ పథకంతో ప్రతి ఇంటికీ రక్షితమైన నల్లా నీరు అందుతున్నది.

**నమస్తే : ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమ (సీసీఐ) విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పందన ఎలా ఉంది.**

**జోగు రామన్న:** సీసీఐ విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. మూతపడిన సీసీఐని ప్రారంభించాలని ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్, నాతో పాటు ఇతర నాయకులు కోరినా బీజేపీ ప్రభుత్వంలో కనీస స్పందన లేదు. కొత్త పారిశ్రామిక విధానంలో భాగంగా పరిశ్రమకు రాయితీలు కల్పిస్తామన్నారు. సీసీఐని రాష్ట్రానికి అప్పగించాలని లేదా 51: 49 నిష్పత్తిలో ప్రారంభిస్తామని సూచించారు. గత ఎన్నికల్లో ఆదిలాబాద్‌కు వచ్చిన కేంద్ర హోం మంత్రి సీసీఐని ప్రారంభిస్తామన్నారు. మాజీ కేంద్ర సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారం సీసీఐని సందర్శించి పరిశ్రమను తెరిపిస్తామన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ సోయం బాపురావు కూడా ఇదే చెప్పారు. ఇప్పుడు పరిశ్రమను అమ్మడానికి చర్యలు చేపట్టారు. సీసీఐ స్క్రాప్‌ను వేలం వేస్తున్నారు. 6 వేల మందికి ఉపాధి కల్పించే సీసీఐ విషయంలో కేంద్రం తీరును ప్రజలు గమనిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెబుతారు.

**నమస్తే : మీ ప్రచారం ఎలా సాగుతున్నది?**

**జోగు రామన్న:** సీఎం కేసీఆర్ నన్ను అభ్యర్థిగా ప్రకటించిన నాటినుంచే ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నా. 40 ఏండ్లుగా ప్రజలకు సేవలు అందిస్తున్నా. ప్రజల మనిషిగా నాకు గుర్తింపు ఉంది. పదేండ్ల పాటు చేసిన అభివృద్ధి, పథకాల అమలు ఫలితంగా ప్రజల నుంచి మంది ఆదరణ లభిస్తుంది. మహిళలు మంగళహారతులు, స్థానికులు పూలదండలు, డప్పు చప్పుళ్లు, పటాకులు పేలుస్తూ, నృత్యాలు చేస్తూ స్వాగతం పలుకుతున్నారు. స్వచ్ఛందంగా ప్రచారానికి తరలివస్తున్నారు. నియోజకవర్గ ప్రజలు ఐదో సారి నన్ను ఆశీర్వదంచడానికి సిద్ధంగా ఉన్నారు.

**నమస్తే : నియోజకవర్గంలో ప్రతిపక్షాల పరిస్థితి ఎలా ఉంది?**

**జోగు రామన్న:** ప్రతిపక్షాలు ప్రజల విశ్వాసాన్ని ఎప్పుడో కోల్పోయాయి. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. యువత పెద్ద సంఖ్యలో గులాబీ కండువా కప్పుకుంటున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రూ. 5 కోట్లకు ఆదిలాబాద్ టికెట్ అమ్ముకున్నాడని ఆ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. బీజేపీ అభ్యర్థిని ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదు. నా బలం.. బలగం నియోజకవర్గ ప్రజలే.



వాయిద్యాలు వాయిస్తున్న గిరిజనులు

# వైభవంగా దండారి

## ఆకట్టుకుంటున్న సంప్రదాయ నృత్యాలు

**ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి** మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో దండారి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో తమ కుల దైవమైన ఏత్మసూర్ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ, నృత్యాలు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఇతర గ్రామాల నుంచి తమ గ్రామానికి, తమ గ్రామం నుంచి ఇతర గ్రామాలకు వెళ్లి ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా పాల్లుగూడ గ్రామానికి లింగాపూర్ గ్రామ దండారిలు అతిథులుగా వెళ్లి ఉత్సవాలు జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు, మహిళలు చాలా ఉత్సాహంగా పాల్గొని సంప్రదాయ పూజలు నిర్వహించి, నృత్యాలు చేశారు. ఉత్సవాలు దీపావళి మరుసటి రోజు మళ్లీ ప్రత్యేక పూజలు నిర్వహించి ముగిస్తారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొరెంగా శంభు, లింగు, ఆత్రం శంకర్, జుగ్నాకా మారుతి, మహదు, మర్సుకోల నాందేవ్ పాల్గొన్నారు.

**- ఇంద్రవెల్లి, నవంబర్ 11**



నృత్యం చేస్తున్న గుస్సాడీలు



నృత్యాలు చేస్తున్న ఆదివాసులు